# చిత్రం!

## ఇంద్రగంటి జానకీబాల



**వారం వారం కథాప్రభ**

**ఇంట్లో అడుగు పెడుతూనే తల్లీ, మావయ్య మాట్లాడుకుంటున్న మాటలు విని, చిరాకెత్తిపోయి, తువ్వాలొకటి తీసుకుని, బాత్‌రూంలోకి వెళ్ళి తలుపేసుకుంది శివాని.**

మూడే అడుగుల వెడల్పుండి తొమ్మిది అడుగుల పొడుగున్న ఆ బాత్‌రూం కమ్ లెట్రిన్‌లోకి వెళ్ళగానే గుహలోకి వెళ్ళినట్లుంటుంది. సన్నటి వెలుగు రేఖ మాత్రం బయట నుండి లోపలికి దూరి గదంతా వెలుబూది పరచినట్లుంటుంది. పాతబడి పోయిన ఆ కొంపలో ఆ మాత్రం వసతి ఉండటమే అపురూపం. పాతికేళ్ళ క్రితమే కట్టిన ఇల్లయినా, ఆ ఇంటిగలవాళ్ళు అద్దెలు తీసుకోవడమే తప్ప, దానివైపు చూడలేదు. అందువల్ల గోడలు, తలుపులు, గడియలు, దర్వాజాలు కిటికీలు గట్టిగానే ఉన్నా దుమ్ముమ్రేగి, వాటి రంగు మార్చుకుని శాపగ్రస్థురాలైన రాజకుమారిలా వుంటుందా యిల్లు.

లోపలికెళ్ళిన శివాని మాసికలతో, మరకలతో, ఊడిన పెళ్ళలతో, రాలిపోయిన సున్నపు పెచ్చులతో అక్కడక్కడ తెల్లగా, కొన్నిచోట్ల జేగురుగా ఉన్న గోడవైపు చూస్తూండి పోయింది. పీలగా దూరం నుంచి ఎవరో మాట్లాడుకుంటున్న మాటల శబ్దాలు లీలగా వినిపిస్తున్నాయి.



వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో ఆమెకి తెలుసు. అందుకే విపరీతమైన విసుగు, చిరాకు ఆమె మనసుని పాడుచేస్తున్నాయి. నిర్లిప్తంగా, నిరాసక్తంగా శివాని గోడ వైపు చూస్తూండిపోయింది. ఒక్కసారి ఆమె ఉలిక్కిపడింది. సున్నపు పెళ్ళలు రాలిన గోడ మీద ఉండి ఉండి ఒక ఆకృతి రూపుదిద్దుకోసాగింది. రెండు కళ్ళు వాటి కింద అమరినట్లు చెంపలు-, చెవుల మీద వాలిన జుట్టు, కొంచెం కిందగా మాసిన గడ్డం, - చెదిరిన క్రాపు - పెదవులపై చిరునవ్వు.

శివాని ఆశ్చర్యంగా మెడ ఒకవైపుకి వంచి చూసింది. ఆ గోడమీద ఆ చిత్రాకృతి కళ్ళు చికిలించి నవ్వినట్లు-, ఆ గోడ ఒక పెద్ద కేన్వాసులా అదొక అద్భుత చిత్రంగా శివానికి ఎంతో బాగుంది. చూడగా చూడగా ఆ అందమైన యువకుడు పలకరిస్తున్నట్లనిపిస్తోంది - యౌవన శోభతో ఆ చెంపలు మెరుస్తున్నట్లు - ఆ కళ్ళు ప్రేమామృతం కురిపిస్తున్నట్లు!

ఈ ప్రపంచం మరిచిపోయి ఎంతోసేపు అలాగే నిలబడిపోయింది శివాని.

'శివా' అనే పిలుపు పాతాళంలోంచి ఆకాశంపైకి వచ్చినట్లయి శివాని ఉలిక్కిపడింది. నీళ్ళు చప్పుడు చేస్తూ తన ఊహల్లోంచి తన హృదయంలోంచి రూపుదిద్దుకున్న ఆ చిత్రాన్ని మరొక్కసారి చూసి బయట కొచ్చేసింది.

"ఎంతసేపే లోపల?" దీర్ఘం తీసింది తల్లి.


శివాని సమాధానమేదీ చెప్పలేదు.

మేనగోడలు శివానిని తన కొడుక్కిచ్చి వెంటనే కట్టబెట్టెయ్యాలని



వైశంపాయనుడూ, తన కూతురు శివానిని మేనల్లుడు వీరభద్రానికిచ్చి పెళ్ళిచేసి బాధ్యత తీర్చుకోవాలని మంగతాయారూ వుబలాటపడి పోతున్నారు.

శివానికి విసుగంతా అదే. వీరభద్రమంటే మొదటి నుండి చిరాకు. అంతకంటే అతని బోదకాలంటే మరీ అసహ్యం. అతనికున్న ఆ బోదకాలుని మర్చిపోయి, అభిమానించి పెళ్ళి చేసుకోవడానికి వీరభద్రం దగ్గర ఒక్క




మంచి లక్షణమేనా లేదు.

కనిపిస్తే కళ్ళతోనే కర కర నమిలేసేట్టు చూసే అతన్నించి తనని తను రక్షించుకోవడమే ఆమెకి ఇప్పుడు, ఎప్పుడూ సమస్య.

ఆస్తిపాస్తులు లేక, ఇళ్ళూ వాకిళ్ళూ లేక, పాడిపంటలూ లేక కేవలం పాతకాలపు పౌరుషాలు, పేదరికమే ప్రతిభగా భావించే మూర్ఖత్వంతో బాటుగా ఆకలి, దారిద్ర్యం మాత్రమే మిగిలా యా కుటుంబంలో. చిన్నప్పుడే తండ్రి పోయిన శివానికి పెద్దగా చదువు లేదు. కానీ తెలివి ఉంది. ఊహ ఉంది. అందమైన పూలని చూసినా, ఆకాశంలో మబ్బుల్ని చూసినా, కదిలే నదిని చూసినా, కడలి కెరటాల్ని చూసినా విపరీతంగా ఆనందపడిపోయే అమాయక మనసుంది. పూలతో మాట్లాడాలనీ, మబ్బుల్లో ఎగరాలనీ, నదిలో ఈదాలనీ ఏవేవో ఉత్సాహాలతో మనసు వువ్విళ్ళూరుతూ వుంటుంది. కాని ఆమె మనసుకి పూర్తి వ్యతిరేకం ఆ యింట్లో వాతావరణం.

అందుకే ఆమెకున్న ఎనిమిదో క్లాసు చదువు తోనే బట్టల కొట్టులో అయిదు వందల రూపాయల ఉద్యోగం సంపాదించుకోగలిగింది. ఆమె పనితీరు చూసి యజమాని మూడు నెలలకే యాభై రూపా యలు జీతం పెంచాడు.

శివానిని తన కొడుక్కి చేసేసుకుంటే, జులా యిగా తిరిగే వాడికి ఒక భుక్తి దొరకడమే కాకుండా తన కారా కిళ్ళీ, బీడీ ఖర్చూ కూడా వెళ్ళిపోతాయని ఆ మేనమామ ఆలోచన.

ఆ తల్లికి మరేం అక్కరలేదు. తన కూతురి కన్నెచెర తొలగించే మహాపురుషుడు మేనల్లుడు. వీరభద్రం మంచివాడని ఆమె ఎప్పుడూ అనుకోదు. కానీ తామున్న స్థితికి మంచేవిఁటి? చెడ్డేవిఁటి? ఏదో ఒక మొగుడంటూ ఉండాలి. ఉన్నంతలో అయినవాడు.

పెళ్ళి మాటెత్తినప్పుడల్లా శివాని గంభీరంగా, ముభావంగా ఉండటం ఆ తల్లికి భయంగా ఉంటూనే ఉంటుంది. అయినా తరుచూ ఆ ప్రస్తావన తెస్తూనే ఉంటుంది.

★ ★ ★

ఆ రోజు శివాని షాపులో బట్టలు మడతలు పెట్టి సర్దుతోంది. అంత క్రితమే పెద్ద బేరం వచ్చి వెళ్ళింది. వాళ్ళు కొన్న సరుకు అయిదు వేలయినా, అయిదు లక్షల విలువ చేసే బట్టలు చూశారు. మొత్తం షాపులో ఉన్న చీరలన్నీ తీయించారు. ఇప్పుడవన్నీ శివాని వాటి వాటి స్థానాలకి సర్దుతోంది. ఆమె కాస్త ఒంటరిగా ఉన్న సమయం చూసి వచ్చి చెప్పాడు రవికుమార్ -

"శివానీ! నువ్వంటే నాకు యిష్టం. నిన్ను పెళ్ళి చేసుకుంటా - నీ కిష్టమేనా?"

"............................"

"నాకు అమ్మలేదు. నాన్న మరో పెళ్ళి చేసుకుని శ్రీకాకుళంలో ఉన్నాడు. ఎప్పుడోగానీ నా గురించి పట్టించుకోడు. ఉన్న ఒక్క అన్న-పెళ్ళయి అదిలాబాద్‌లో ఉద్యోగంలో ఉన్నాడు. నన్నెవరూ అడ్డుపెట్టేవారు లేరు. నీకిష్టమైతే..." అతని మాటలు పూర్తి చేశాడు.

శివాని వెంటనే ఏం మాట్లాడలేకపోయింది. ముందు భయం, నెమ్మదిగా ఆశ్చర్యం ఆమెని ముంచెత్తాయి. తవ్వుతున్న నూతిలో జలపడినట్లు ఆమె హృదయాంతరాళంలో ఆనందం గలగల మంది.

శివాని రవికుమార్ కులం గురించి ఆలోచిం చాల్సిన అవసరం లేదు. బ్రాహ్మలు ఏ సంస్థ పెట్టినా అందులో బ్రాహ్మల్నే, కోమట్లు కొట్టు పెడితే అందులో వాళ్ళ వాళ్ళనే, కమ్మవారేదేనా పరిశ్రమ పెడితే అందులో అందర్నీ వాళ్ళ కులస్తులనే పెట్టుకునే సాంఘిక ఆచారం పూర్తిగా బలపడిపోయిన ఈ రోజుల్లో, ఈ సమాజంలో-, రామనాథశాస్త్రిగారి బట్టల కొట్టులో రవికుమార్ ఎవరు అని ఆలోచించాల్సిన పనిలేదు. కానీ శివానిని భయపెడుతున్న సమస్య వేరే ఉంది. చచ్చిపోయిన శవంలా ఉన్న తన తల్లి పక్కనే పీక్కు తినేందుకు సిద్ధంగా కాచుకుని కూర్చున్న నక్కల్లాంటి మావయ్యని, వీరభద్రాన్ని గురించే ఆమె ఆలోచన.

రవికుమార్‌తో ధైర్యంగా తన మనసులోని మాట చెప్పాలని ఉంది. కానీ భయం. ధైర్యాన్ని కూడదీసుకోవాలి. మాటల్ని పోగు చేసుకోవాలి.

'వెంటనే చెప్పక్కర్లేదు. రెండు రోజులు టైమిస్తున్నా ఆలోచించుకుని చెప్పు" అన్న రవికుమార్ మాటల్ని ఆసరా చేసుకుని ఆలోచనలో పడింది.

ఉదయం లేస్తూనే బాత్‌రూంలోకి వెళ్ళింది. తన ఊహాచిత్రం అలాగే ఉంది. ఒక్క నిమిషం తదేకంగా చూస్తూండి పోయింది. అవును. ఆ బొమ్మ నిన్నలాగే నవ్వుతున్నట్లు, స్నేహంగా పలకరిస్తున్నట్లు వుంది. ఒక్క క్షణం ఆ బొమ్మ తన ప్రేమికుడు రవికుమార్ అనుకుని, తన మనసులోని మాటలు చెప్పాలని పెదవి విప్పింది., ఆ చిత్రంలో రవికుమార్ పోలికలే కనిపిస్తున్నాయి.

"నీకు అమ్మ లేదు. నాకు నాన్న లేడు. అమ్మ మరో పెళ్ళి చేసుకునే వీలులేదు కనుక మావయ్య పైశాచిక నీడలో బతుకుతూ నన్ను పెంచింది. ఆ మావయ్యకున్న ఒక పనికిరాని కొడుక్కి నన్నిచ్చి పెళ్ళి చెయ్యాలని చూస్తోంది." నెమ్మదిగా శివాని మాట్లాడింది. ఆ చిత్రం కదల్లేదు. మెదల్లేదు. కానీ కళ్ళలో ఏదో వెలుగు, ఏదో ఓదార్పు, ధైర్యాన్నిచ్చే భరోసా.

శివాని గుండె నిండా ఆనందం, ధైర్యం-,

"ఇదిగో శొంఠి ముక్క కాల్చాను. మొదటి ముద్దలో తిను. ఏమిటలా అస్తమానూ... కడుపులో నొప్పి కూడా వుందా?" తల్లి ఆరాటం చూసి శివాని ఫకాల్న నవ్వబోయి, నిగ్రహించుకుంది. సమాధాన మేదీ చెప్పకుండా అమ్మ పెట్టింది తినేసింది.

శివానికి ఏకాంతమంటే ఆ ఒక్కచోటు మాత్రమే. అలా తను వంటరిగా రెండు నిమిషాలు


నిలబడితే ఎదురుగా. తన ఊహాచిత్రం ఊరటగా, అభిమానంగా, ప్రేమగా - తన ప్రేమ రవికుమార్‌కి ధైర్యంగా చెప్పే ధైర్యాన్నిచ్చిన ఆ బొమ్మ తనకి మాత్రమే కనిపిస్తుంది. తన కోసమే రూపు దిద్దుకుంది.

ఆ రోజు అంతా నిర్ణయమయి పోయింది. ఆర్యసమాజంలో మిత్రుల సమక్షంలో-

తల్లిని మోసగిస్తున్నాననే బాధవున్నా, మావయ్యకి తెలిస్తే తన చేతులూ కాళ్ళూ కట్టి, కొడుకుచేత తాళైనా కట్టిస్తాడు. లేకుంటే తనని కాలువలోనైనా పడేస్తాడు. అందుకని, తనిప్పుడిలా రహస్యంగా వుండక తప్పదు.

ఇన్నాళ్ళుగా చూస్తున్న ఆ బొమ్మని, ఆ క్షణంలో ఒక్కసారి తాకాలనిపించింది. సున్నితంగా ఆమె మునివేళ్ళు ఆ పెదవుల్ని స్పృశించాయి.

అక్కడ బలహీనంగా వున్న సున్నపు పెచ్చు ఊడిపడింది. బొమ్మలో భావం మారిపోయింది. శివాని గుండె ఆగినంత పనైంది. నిదానంగా, తదేకంగా చూస్తుండిపోయింది. ఇప్పుడా బొమ్మ తనని చూసి కొంటెగా పళ్ళు బయట పెట్టి వెక్కిరిస్తున్నట్లుంది. శివాని ఊపిరి పీల్చుకుని తనూ వెక్కిరించి, ఆనందగా బయటకొచ్చింది.



**వండర్ న్యూస్**

అంతర్జాతీయ వ్యాపార రంగంలో ప్రథమ స్థానం పెట్రోల్‌దయితే ద్వితీయ స్థానం కాఫీ, టీ లది.

**బేరి మధుసూదన్** (గడివేముల)

ఆ బొమ్మతో ఋణం తీరిన భావం బాధించింది.

★ ★ ★

మంగతాయారు కూతురికి కంచంలో అన్నం పెట్టి చెప్పడం మొదలు పెట్టింది.

"నిన్న వెళ్ళి ఇంటి వాళ్ళతో పోట్లాడి వచ్చాను. ఇల్లిలా పాడు పట్టినట్టు పెట్టారు. మేమూ డబ్బులిచ్చే వుంటున్నాం కదా! పదేళ్ళయినా దాని ముఖం చూడకపోతే ఎలా? కాస్త వెల్లయినా వేయించండి. పిల్ల పెళ్ళి కూడా ఉంది'' అని నాలుగు దులిపాను. ఆయనేమనుకున్నాడో-

'ఈ నెల అద్దె మాకొద్దు. మీరు శుభ్రం చేయించుకుని వెల్లలు వేయించుకోండి' అన్నాడు.

"వస్తూ వస్తూ వీరాసామితో మాట్లాడాను. ఒక్కపూట చాలన్నాడు. నువ్వెళ్ళిపోతే, సామాను సర్ది పెట్టేస్తాను'' అంటూ ముగించింది.

శివాని చురుకుగా తలెత్తి చూసింది. పులుసు కలుపుతూ మంగతయారు కూతురి వైపు చూడ లేదు.

సాయంత్రం తను ఇంటికొచ్చేసరికి తన నేస్తం కనిపించడు. తెల్లని వెల్లల వెనుక మాయ మవుతాడు. అందుకే తను సాయంత్రం అసలు ఇంటికే రాదు.

ఈ రోజు పన్నెండు గంటలకే ఆర్యసమాజంలో పెళ్ళి. తన నిజనేస్తంతో జీవితం మొదలు.

శివాని బాత్‌రూం తలుపు తీసింది. వెక్కి రిస్తున్న బొమ్మలో విజయ గర్వం.

"త్వరగా తెమిలి వెళ్ళు. నాకు పనుంది'' అడుగు బయటకు పెట్టిన శివానికి వెనుకగా ధైర్యాన్నిస్తూ వీపు నిమిరిన భావం కలిగింది.

●

# వృత్తుల్లో హాస్యోక్తులు

మీరు డాక్టరా? యాక్టరా? కాంట్రాక్టరా? టీచరా? లాయరా? ఇంజనీరా?

**మీ వృత్తి ఫార్మస్యూటికల్స్‌లోనా? బ్యూటీ పార్లర్‌లోనా? విమానాలలోనా? రైల్వే శాఖలోనా?**

**పోనీ... ఏదోక వృత్తి - ఎక్కడో ఒకచోట ఈ దేశంలో సవాలక్ష వృత్తుల్లో మీరూ ఉన్నారు కదా!**

అటువంటి మీరు మీ మీ వృత్తుల వాతావరణంలో తమాషాగా పుట్టుకు వచ్చిన హాస్య సందర్భాలను సరదా సరదా మాటల్లో క్లుప్తంగా రాసి పంపండి.

మీ వృత్తిలో మాత్రమే తలెత్తిన సంఘటన కావాలి సుమా!

**1. రచన ఒక ఇన్‌లాండ్ కవరు మించి ఉండరాదు.**

**2. ప్రచురణకు ఎంచుకున్న రచనకు పారితోషికం ఉంటుంది.**

మీ రచనలు పంపవలసిన చిరునామా :

**ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,**

**ఎక్స్‌ప్రెస్ సెంటర్, లోయర్ టాంక్ బండ్. దోమలగుడా, హైదరాబాద్ - 500 029.**